జన్మాంతర సంబంధము

శతావధాని వేలూరి శివరామశాస్త్రి గారు

లక్ష్మీనారాయణకు ఇద్దఱు కుమారులు. పెద్దవాఁడు సూరన్న; రెండవవాఁడు మంచన్న.

సూరన్న కడు చలాకీవాఁడు; ఊరిలో జట్టునకు ఏకచ్ఛత్రాధిపతి. ఊరంతయు మాటు మఱఁగిన తరువాత దొడ్లలో దూఱి దోసిమ్మ కాయలు పొట్లకాయలు వంకాయలు మొదలగునవి ఎత్తుకొనివచ్చి తమలోతమకు పంచుటలోను, ఇతరులకు విందులు చేయుటలోను అందెవేసిన చెయ్యి. వినాయకచతుర్థినాఁడు ఇండ్లమీఁద రాలురువ్వుట, దీపావళినాఁడు భయపడి పోవువారిమీఁద చిచ్చుబుడ్లు పాఱ వేయుట ఈ మొదలగు పోకిళ్లతో 'వీఁడూ ఒకమనిషి' అని లోకములో జమకట్టఁబడినాఁడు.

మంచన్నకు నాలుగేండ్లకు నాలుగు బదులు నాలుగైదక్షరములు తక్కువగా వచ్చినవి. గుంటఓనమాలు దిద్దుటచే చూపుడు వేలిలో ఒకకణుపే మిగిలినది. పిల్లలందఱు మొట్టికాయలు వేయఁగా వారికడనుండి పాఱి పోయి వాఁగికొనును గాని తనతల్లియగు భవానిచేఁ గూడ ఆ అవినయమును చెప్పి కొనఁడు.

అతఁడు ఇపుడు కట్టుచో పండ్రెండు మూళ్లకు తక్కువబట్ట కట్టఁడు; లేనిచో జేనెఁడుతడి కొల్లాయగుడ్డ. చుట్టుచో ఇరువది మూరల తలపాగ; లేనిచో జందెమే. ఇటులు ఉండుటచే జనాభాలెక్కలలోఁగూడ నతని పేరు ఎక్కలేదు.

మంచన్న యన్నచో తండ్రికి తలపోటు. మంచన తండ్రియెట్టిదటి కెపుడును పోయి యెఱుఁగఁడు. తండ్రి తనపంక్తిలో వానికి ప్రవేశమును రద్దుపఱచెను. అందఱ భోజనములు అయినపిదప తల్లి అతని నొకమూల కూర్చుండఁబెట్టి అన్నము పెట్టును. విస్తరి ముందునుండి లేచుట యననేమో అతఁడెఱుఁగఁడు. 'నాయనా! చాలు!' అని తల్లి అనలేక అనలేక అని మంచనను విస్తరిముందునుండి లేవఁదీయుచుండెడిది.

మంచన శరీరమున కంతటికి కను లలంకారములు. ఒకవిధముగా వికారములుకూడ. ఏలయనిన ఆపొట్టయు, ఆకాళ్లును, ఆచేతులును ఆయొడలును కల ఆమనుజునకు కన్నులుకూడ చింతాకులవలె నుండుచో ఆశిల్పము చతురస్రముగా ఉండెడిది. కావున పద్మములవలె నున్న ఆకన్నులు అతనికి వికారముగా ఉన్న

వన్నను అనవచ్చును. ఎవఁడేని క్రొత్తవాఁడా కన్నులుచూచి 'వీనిలో ఏదియో విశేషమున్న'దని అనుకొనక మానఁడు. ప్రకృతము కానఁబట్టుచున్న విశేష మేమనఁగా తిండిలో అత్యాధిక్యము.

లక్ష్మీనారాయణకు పూర్వార్జితము నాలుగెకరములకంటె ఎక్కువలేదు. ఆ క్షేత్రము మీఁద వచ్చుపంట వారికి బొటాబొటీగా సరిపోవును. సూరన్న చెట్టుక్రింది ప్లీడరుగా ఉండి ఇపుడు కొంచె మార్జకుఁ డైనాఁడు. కాఁబట్టి తండ్రి యధికారము సూరన్నకు సంక్రమించినది. మంచన్నను ఛర్దనము మర్దనము చేయు నధికారము తండ్రి వదలిపెట్టను లేదు. సూరన్నకు సంక్రమింపకపోవను లేదు. తల్లి అడ్డమువెళ్లి మంచన్న దెబ్బలలో కొన్ని పంచుకొనుచుండెడిది. దానిచే 'మీఅమ్మకుఁ గూడ దెబ్బలు తెస్తున్నావురా వెధవా' అని తిట్టులును, రెట్టిదెబ్బలును మంచన్నకు ముట్టుచుండెడివి.మంచన్న ఈదెబ్బలుకూడ అన్నముతోపాటు జీర్ణము చేసికొనుచుండెడువాఁడే కాని కేవలము తండ్రియే యగుచో ఊరకుండువాఁడే. ఏలనఁగా చిన్ననాఁటనుండి తండ్రిచేతిదెబ్బ, అమ్మ ఆముదము రాయుటతోపాటు అభ్యాస మయిపోయినది. క్రొత్తగా అన్నగారిదెబ్బ లధికమగుటవలన అతనిలో అభిమానదేవత నూతనముగా జాగరిల్లినది. ఈవిశేషమును అతనికనులు సూచించుచో సూచింపవచ్చును.

చిన్ననాఁట అన్నదమ్ములు ప్రేమయుగళము. అన్న తమ్ముని శిక్షించును; తమ్ముఁడు దెబ్బతిన్న పామువలె దానిని సహించి చూచుచుండును. అతని కనుకూలమైన యౌవనము ప్రాపింపఁగా వారిరువురు శత్రుయుగళ మయిపోదురు. పాపము! అపుడు అన్న తనప్రేమమును క్రమ్మరించునుగాని తమ్ముఁడు దానిని ఈర్ష్యయని తలఁచునంతపగ పెట్టుకొనును.

అన్నదెబ్బల కావేదన పడలేక ఇంటనెవరికి చెప్పక మంచన్న దూరదేశములో నున్న బంధుజాలము నంతయు తిరుగవేయ మొదలిడెను. అతని కిపుడు స్వర్గమున నున్నటు లుండెను. తనవాలకమును, తిండిని చూచి వరసఅయినవారు అనుమాటలు తానుపడుట, మరల వారికి సమాధానము చెప్పుట అనునదియే ఇపు డతనికి స్వారాజ్యసుఖము. అతఁడేబంధువులయిండ్లలోను ఉండఁదలఁప లేదు. బంధుగృహము లన్నియు తిరుగవేయుటలో అతని ఉద్దేశ మేమనఁగా మంచన యను పిల్లవాఁడొకఁడు లోకమున నున్నాఁడనియు, అతని కింకను పెండ్లికాలేదని వారందఱకు తెలియవలయు ననియు.

అతఁ డటులు తిరిగితిరిగి బంధులోకమునకుఁగూడ తనయందు దయలేదనియు తండ్రికే తనపై నెక్కువ దయ కలదనియు తెలిసికొన్నాఁడు. ఏలనగా బంధువులు 'మీమంచన్న ఇక్కడికి తప్పించుకొని వచ్చినటులు తోఁచుచున్నది. వెంటనే తీసికొనిపొండు!' అని లక్ష్మీనారాయణకు వార్తలు పంపఁగా అతఁడు మంచన్నను రావించుటకు యేమి యేర్పాటును చేయకుండుటయేకాక వారికి ప్రత్యుత్తరమేని పంపలేదు.

తండ్రి కెప్పుడేని తనపై దయతప్పిపోవునేమో యనియు ఏబంధుగేని తనపై ద్వేషముచే తండ్రి కప్పగించి పోవునేమో యనియు మంచన బంధులోకమును విడిచిపెట్టెను. ఏకాంతములో ప్రవేశించిన యోగివలె అతడు లోకములో ప్రవేశించెను. సత్రము అగపడుచో సత్రమున, విందు దొరకుచో విందున, బ్రాహ్మణార్థము కుదురుచో నచట, లేనియెడల ఎవరియింటనో ఒకరియింట భోజనమొనరించుచుండెను. ఎవరిని ఎర్రని ఏగాని అడుగఁడు; కావున లోకుల తిట్టులుకాని దెబ్బలుకాని అతఁడు చవిచూడలేదు.

ఇటులు సమస్తలోకమున ఆదర మనుభవించుచు అభిలషించుచు తిరిగితిరిగి మంచన్న శైలారామ మనుగ్రామముప్రవేశించెను. ఆసంధ్యాసమయమున వానచినుకులు ఉదాసీనముగా పడుచుండెను. భోజనమునకు లేవవలసినదను భార్యల పిలుపుల నభిలషించుచు కొందఱును, పగట నంతయు సోమరితనము వలనఁ గలిగినబరువును మోయుచు కొందఱును వాకిటి అరుఁగులపై కూర్చున్నారు. నడివయసు, లంబోదరము, గజగమనము, స్మితముఖము, దీర్ఘనేత్రములు వీని కన్నిటికి కిరీటముగా నున్న తలపాగ, బుజముపై నున్న చిన్న కొల్లాయయు కల ఆమంచన్న ఆకారము వారి నాకర్షింపక మానలేదు. ఏయూరు మీదన్నచో ఎక్కడ ఉండు మనవలసివచ్చునో యని ముందుచూపుగల కొందఱు అతనిని పలుకరింపలేదు; కాని సంసారపుజంజాట మెఱుఁగని బాలురు అతనిని 'మీ దేవూరు? ఎక్కడినుంచి రావడం? ఎక్కడికి పోవడం? ఎందుకు వస్తూన్నావు?' అను వివిధప్రశ్నలు వేయక మానలేదు. కొందఱుబాలు రతనివెనువెంటనే నడచుచు మీఁది కొల్లాయయు, గోఁచియు తుదకు కిరీటమును తాఁకక విడువలేదు.

మంచన్న కాప్రశ్నలు మహానందముగా ఉన్నవి. 'వీరెవరో బంధువులే; కానియెడల ఇన్ని ప్రశ్న లేల వేయుదురు? విశేషించి మీ దేయూరనియు, ఏయూరినుండి రాకయనియు, అడుగుట కేమిపని? ఇంక గుడ్డ గోఁచులు తాఁకుట కేటియక్కఱ?' అని మనస్సులో తనతో వారి కేదో సంబంధ మున్నదని నిర్ధారించుకొన్నాఁడు. అతఁ డెవరికిని ఏమియు సమాధానము చెప్పకుండ బజారువెంట పరిక్రమించుచున్నాఁడు.

అతని యాకారమును వెంటఁబడి బాలురతనితో చేయు పరిహాసమును అరుగుమీఁద అఱమోడ్పుకనులతో పడుకొన్న అనంతుఁడు చూచుచున్నాఁడు. అది యెల్లయు నతనికొక స్వప్నమువలె నున్నది. తనయెదుటనుండి పరిక్రమించుచున్న ఆయాకార మొక మనుష్యుఁడే యనియు అది కలకాదనియు తెలిసికొని అనంతుఁడులేచి 'మాట, మాట; మీ దేయూరు?' అని అడిగెను.

ఇదివఱ కెవరికి సమాధానము చెప్పని మంచన్న 'మాది రామాపుర'మని ప్రత్యుత్తరము చెప్పినాఁడు అనంతుఁడు. 'ఎక్కడికి వెళ్లుచున్నా'వని యడుగఁగా మంచన్న ఇక్కడికే అన్నాఁడు. 'అగుచో రమ్మ'ని అనంతుఁడనఁగా మంచన్న వచ్చి ఆవలి యరుఁగుమీఁద కూర్చుం

డెను. అనంతుఁడు 'మాయింట నుందువా' యని యడుగఁగా 'ఆలాగుననే ఉందు' నని మంచన్న అనెను.

'ఇఁక ఈజన్మము నిర్విచారముగాగడఁప వచ్చు'నని మంచన్న అనుకొన్నాఁడు. వెంట వచ్చిన బాలురందఱకు ఆశ్వాసము కలిగినది. అనంతుఁ డతని లోనికిఁ దీసికొనిపోయి 'ఓయీ! అల్లుఁడు వచ్చినాఁడు; కాళ్లుకడుగుకొనుటకు నీరుపట్టుకొని ర'మ్మనియెను. మంచన లోలోపల ముసిముసి నవ్వులు నవ్వుకొనెను. అమల నీరుదెచ్చి పలువురు బాలురచే పరివేష్టితుఁడైయున్న మంచన్ననుచూచి చేయి నోరి కడ్డముపెట్టుకొని నిశ్చేష్టయై నిలువబడిపోయినది. అనంతుని పెద్దకూఁతురు బృంద తలుపు చాటుచేసికొని గదిలోనుండి తొంగి చూచుచు కోపముఖముతో నిర్గమించి నిలువబడినది. బృంద చెల్లెలు కామోద 'బావా బావా' అని కిలకిల నవ్వుకొనుచు దాపునకేఁగి తెల్లబోయినది. బాలు రందఱు పెద్దపెట్టున అరచిరి. మంచన్న కామోదను చూచుచు 'ఈపిల్లనే నాకిత్తురా?' అని అనెను. అందఱు నవ్విరి. ఈరీతిగా మంచన్న కాయింట ప్రథమప్రవేశము కలిగినది.

నిత్యసభలతో ఇటులు పదినాళ్లు కడచినవి. రెండుపూఁటలుతిని కూర్చుండుచున్న మంచన్నకు ఏమియు తోఁచుటలేదు. ప్రతి దినము 'కామోద కేమేమి నగలుపెట్టెద' వని యడిగి 'మంగళసూత్రము పెట్టెద'నని సమాధానము తెలిసిన యాకే తిరిగివచ్చు చక్రము వలె తనకు క్రొత్తనింత కలిగింపమి అనంతునకును ఏమియు తోఁచుటలేదు. పిల్లలకుమాత్ర మిసుమంతయేని తీరిక లేకున్నది.

అనంతుఁ డొకనాఁ డొక కావడిబద్ద, మట్లుతెచ్చి 'మంచన్నా! ప్రతిదినము దీనితో మనయింటికి కావలసిన నీరు తెచ్చుచుండుము! ఇది లెస్సగా మోసినతరువాత సంసారము మోయుదువుగాని' అని అనెను.

మంచన్నకు సరిగా ఆపని నచ్చినటులయినది. అతఁడు బుజాన కావడిపెట్టుకొని నీళ్లుమోయ నారంభించెను. మొట్టమొదట ఊఁపునకు బిందె లటు ఇటు ఊఁగి కాళ్లకు కొట్టుకొని క్రిందపడుట, బుజములపై కాయలు కాచి బాధపడుట జరిగినదికాని కొన్నాళ్లలోనే ఆవిద్య అతనికి 'ప్రవేదిరే ప్రాక్తన జన్మవిద్యాః' అన్నటులు సంపూర్ణముగా వచ్చినది. పిమ్మట మంచన్న చేతులతో కావడిబద్ద పట్టుకొనకయే నీళ్లుమోయుట కలవాటు పడినాఁడు. పిల్లలంద ఱతనికి 'మంచినీళ్ల మంచన్న' అని పేరుపెట్టినారు. కామోద నిచ్చి పెండ్లి చేయుదు మన్నచో నెంతసంతోసమో మంచినీళ్ల మంచన్న అని యన్నను అతని కంతే సంతోసము. కావడి బాగుగా మోసినఁగాని సంసారము మోయుట తెలియదని అతని నమ్మకము.

మంచన్నను ధన మెన్నఁడు ఆకర్షింపలేదు. అతఁ డెన్నఁడు అన్నవస్త్రములు కొని మెఱుఁగఁడు. వానికంటె వేఱేమియు నతని కక్కఱలేదు. లోకు లన్నివిధముల ధనము గూడఁబెట్టి కాపాడుకొందురని అతఁ డెఱుఁగఁడు. నియతప్రకారము మంచినీరు తెచ్చుట,

అనంతునిచేతను అతని జ్ఞాతులచేతను 'అల్లుఁడా' యని యనిపించుకొనుట, బాలికలచేతను బాలురచేతను వినోదింపఁజేయఁబడుట, భోజనము చేయుట, వీనిచే మధ్యాహ్నమును, ఉప్పునీరు చేఁదుట, తనకు తగినవారితో సంభాషించుట, తలపాగ చుట్టుకొని ఊరేఁగుట వీనితో సాయంకాలమును నిర్విచారముగా అతనికిఁ గడఁచుచున్నవి. కాలము మెల్లగా గడఁచుటగాని,త్వరగా పరుగులెత్తుట గాని యీరెండును అతని కనుభవములో లేవు. అతఁడు రాత్రి ప్రక్కవేయుచో సూర్యోదయమువఱకు కర్రవలె నిద్రించును.

కామోదకు పెండ్లియీడు వచ్చినది. సంబంధము కుదిర్చి లగ్నము నిశ్చయించినారు. మంచన్న ఆనాఁడు కావడిబద్ద బుజానఁ బెట్టలేదు. గదిలో మూలుగుచు కూర్చున్నాఁడు. వంటవేళ అయినది. నీళ్లు లేవు. ఎన్ని మాఱులు పిలిచినను పలుకఁడు. కొంత సేపటికి శ్యామ గదిలోనికి పోవఁగా కనుల వెంట నీరు రప్పించుకొని మంచముక్రింద కూర్చున్న మంచన్న కానిపించినాఁడు. శ్యామ 'మంచన్నా! ఏల యేడ్చెద' వని యడుగఁగా 'కామోదను నా కీయరఁట!' అని విలపించినాఁడు. 'అయ్యొయో నన్ను చేసికొందువుగాక!' అని శ్యామ అనఁగా 'నిజము? నిజము?' అని మంచన్న అన్నాఁడు. 'నిజంఘా' అన్నది శ్యామ. దాసితో ఎక్కడలేని సంతోషము వచ్చినది మంచన్నకు. చాటుగా నుండి వినుచున్న అమల 'మంచన్నా! నీళ్లేవీ?' అని అడుగఁగా శ్యామ 'అమ్మా! కామోదను ఈయ రని మంచన్న ఏడ్చుచున్నాఁడు' అని చెప్పెను. అమల 'అయ్యో, పిచ్చిఅల్లుఁడా! శ్యామను నీకిచ్చెదము' అనువఱకు మంచన్న అమాంతము లేచి కావడి బుజానఁబెట్టుకొని చెఱువునకు బయలుదేఱి యెదురైనవా రందఱితో 'నాకు శ్యామ నిస్తారు, నాకు శ్యామ నిస్తారు' అని చెప్పికొనుచు వెళ్లెను. వారు 'శ్యామనూ ఇస్తారు, పద్మనూ ఇస్తారు' అని అతని సంతసము ఇనుమడింపఁజేసిరి.

అతఁ డీసంతోషములో మునిఁగి తేలాడుచుండగాఁ ఇంటివద్దనుండి మఱియొకసంతోషవార్త వచ్చినది. అది తండ్రిమరణవార్త. అతడావినోద మనుభవించుటకు నేఁటికి పదప్రచలనము చేయవలసి వచ్చినది. అతఁ డింటికి వెళ్లెను. తాను తద్దినము పెట్టువాని తమ్ముఁడే కాన ఆతనికి క్లేశ మంటలేదు.

భర్త చనిపోవుట, కుమారుఁ డెందులకు కొఱగాక పెండ్లి లేక దేశాలపాలగుట, అన్న తమ్ముని విసర్జించుట భవానిని మిక్కిలిబాధించినవి. ఆమె ఆదుఃఖమున మంచన్నను దగ్గఱ కూర్చుండఁబెట్టుకొని 'నాయనా! ఇక నిన్ను అన్న కొట్టఁడు. ఏకొండ్రయో అమ్మి పెండ్లి చేసి చూడవలెనని ఉన్నది.' అని రోదనము చేయఁగా మంచన్న నగుచు 'అమ్మా! నా కచట నొకయిల్లున్నది. పెండ్లికూఁతుకూడ ఉన్నది. పెండ్లి చేసికొని ఒకసారి నీకు చూపించి తీసికొనివెళ్లెదను చూడు!' అని చెప్పి ఆమె దుఃఖమును ద్విగుణము చేసెను. కర్మలయిన పిదప తల్లితో 'మాయింటికి వెళ్లిపోవుదు'

ననిచెప్పఁగా ఆమె అతికష్టముమీఁద ఒకరోజు ఆఁపుసరికి దేవతలు దిగిరావలసివచ్చినది.

పశువు కొన్నాళ్లు బందిలిదొడ్డిలోనైనను ఉన్నచో మరల అది అక్కడికి వెళ్లగోరును. వింతలతో వినోదములతో బాలికల హాస్యములతో స్వర్గసుఖ మనుభవించుచున్న మంచన్న మరల శైలారామమున అనంతుని యింటికి వెళ్లఁగోరుకొనుటలో ఆశ్చర్యము లేదు. అతనికి తల్లియన్నచో ప్రేమ యున్నది కాని దానికి సూరన్న భయము మాటు. కావున అతని కనంతుఁడే తల్లి.

సూరన్న తనను మాటాడించి ఎక్కడ తన్నిపోవునో యనుభయము తొందరపెట్టగా తల్లితోఁగూడఁ జెప్పకయే లేచిపోవలయునని మంచన యూహించుచున్నాఁడు. సూరన్న తమ్ముని తొణుకుబెణుకులన్నియు కనిపట్టి తల్లికడ పసిపిల్లనివలె నున్న అతని కడకు వెళ్లి 'తమ్ముఁడా! నాయనా పోవనే పోయెను. ఏ కొండ్రయో అమ్మ నీ కొక పిల్లను ముడిపెట్టవలసిన విధి నామీఁద ఉన్నది. కాఁబట్టి నీ వల్లరి చిల్లరగా తిరుగక ఇంటనే పడి ఉండు' అని అనెను.

ఈమాట లకాలజలదోదయము వలె భవాని కాశ్చర్యము కలిగించినవి. ఆమె కనుల నీ రొత్తుకొనుచు 'మంచన్నా! అన్నాయికి నీ మీఁద దయకలిగింది. రెణ్ణెల్లపాటిక్కడ నుండు!' అని బతిమాలుకొన్నది. సూరన్న ఎంత [illegible]గా ఉండుమని కోరునో మంచన్న అంత [illegible] లేదని భవాని అనుకొనలేదు.

తెలవారుకడ ఎవరికి తెలియకుండ మంచన్న మాయమయినాఁడు. 'వాడు వట్టి వెఱ్ఱివాఁడయి పోయినాఁడు. ఉండమంటే ఉంటాఁడా?' అని సూరన్న తల్లికడ సంభాషింపఁగా భవానిదుఃఖించినది. కాని మంచన్న సూరన్నకు జంకియే వెళ్లియుండు నని ఆమె లోలోపల తలఁపకపోలేదు. ఆమె బంధువులలో పిల్లలను గుఱుతుతెచ్చుకొని సూరన్నతో చెప్పుచుండెడిది. సూరన్న వెంటనే వారి వారికి వార్తనంపి వారివారిఅసమ్మతిని ఎప్పటి కప్పుడు తల్లికి నివేదించుచుండువాఁడు. మంచన్న అన్నను మఱచి శైలారామమున సుఖముగా నున్నాఁడు.

అనంతునికుమారుఁ డగులచంద్రుని వివాహము వచ్చినది. ఇల్లంతేయు మంచన కప్పగించి అందఱు తరలి వెళ్లినారు. మంచన్న కది యెంతగౌరవము! పెండ్లివారు తొందరగా వెళ్లుచు పాఱవైచుకొన్న నగలమూట మంచనకు దొరకినది. అతఁడు దానిని భద్రముగా దాఁచెను. చీఁకటిపడఁగనే కర్ర బుజముమీఁద పెట్టుకొని ప్రహరి తిరుగును. తలుపు లన్నియు తాళములుపెట్టి తడవతడవకు లాఁగి చూచును. చీమ చిటుకుమన్నచో రివ్వునఁ బాఱి సందేహము పోఁగొట్టుకొనును. అతఁ డొకదయ్యమై యింటి నావహించినట్లు ఆయింటి నావహించెను.

నగలమూట యింట జాఱిపోయెననియు, మంచన దాని నపహరించెననియు అమల అనంతునితో పోరుపెట్టెను. ఛీఛీ తెలిసి మాలినదానా! నగ లింటనే జాఱిపోయిన

యెడల మంచన మన యినుపపెట్టెయే!” అని యనంతుఁ డనెను. అమల యింటికి మనుష్యుని పంపుమ్మని రాపాడినను అనంతుఁడు చెవి యొగ్గలేదు.

పెండ్లివారు తూర్యధ్వనులతో దిగిరి. అనంతుఁ డింట కాలిడఁగనే మంచన నగల మూట నింటిబరువుతోపా టతనిముం దిడెను. అనంతుఁడు ‘మంచనా! నీవు నాకు తీసికొనని అప్పు, తీఱని ఋణము’ అనియెను. అమల అతని విశ్వాసమున కాశ్చర్యపడెను.

మంచన్న కొకనాఁడు టపావాఁ డొక యుత్తరమును మనియార్డరును తెచ్చి యిచ్చెను. అది యతని జాతకమున నొకమహాయోగము. ఏమనఁగా గవర్నమెంటు నవుకరు తనకు ఉత్తరము మోసికొని వచ్చినాఁడు. మఱియు నాలుగురూకలు బహుమతి తెచ్చినాఁడు.

తండ్రి తద్దినము పెట్టుకొనుట కింటికి రావలసినదని వ్రాసి ప్రయాణవ్యయమునకై నాలుగురూకలు సూరన్న పంపినాఁడు. ఆపైకము సూరన్నయే పంపినాఁడని మంచన్నకు గోచరించినపు డతనిమన స్సొక నూతనమగు భ్రాతృప్రేమతో తొణికిపోయినది. మంచన్న వెంటనే రామాపురమునకు పయనమయి పోయెను. భవాని మంచననుచూచి నూతనముగా కనినటులే యానందించెను. ఆతఁ డొనరించిన కర్మమే భర్తకు ముట్టునని యామె తలఁపు.

మాసికము, ఏఁడుసి, తద్దినము సమాప్తమైనవి. తద్దినమునాఁటి నడికిరేయి సూరన్న మంచన్నను వెదకికొనుచుఁబోయి యతనిని లేపి ‘నాయనా! ఇటుర’ మ్మని పిలిచెను. మంచన్న కిన్నాళ్లనుండియు లేని భ్రాతృప్రేమ ఒక్క సారి నిండుకొనెను. సూరన్న యన్నచో పాఱు మంచన్న యిపు డతనిని గోఱియవలె ననుగమించెను. సూరన్నతమ్ము నొకయింటి లోనికిఁ దీసికొనిపోయి ‘ఈకాగితము మీఁద వేలిముద్దర వైవు’ మనియెను. అదియు కర్మలో నొకభాగమనుకొని మంచన తన బొటనవేలిని మసి కంటించి కాగితముపై దక్షిణమునుండి ఉత్తరమునకుఁ ద్రిప్పెను. అది సూరన్నయపకీర్తి ముద్రవలె నల్లని బహురేఖలతో నంటుకొనెను.

ఔరా! సూరన్న ఎంత తెలివిలేనివాఁడు! తమ్ముని తర్జనభర్జనములచే నెడఁబాపుకొనెను గాని ఒక్క ప్రేమవాక్యము చేతనే అతని యాత్మనే శరీరసమేతముగా స్వాధీనము చేసికొనవచ్చునే! మంచనా! సహస్రాబ్దములు జీవింపుము! నీకు ధన మక్కఱలేదు భూమి యక్కఱలేదు. ప్రేమకిరణ మొక్కటియే నీ వాసించుచున్నావు. దేనిని నీ వాసించుచున్నావో అది వెలపెట్టినను రానిది. దానిచేతనే యీజగతి జీవించుచున్నది.

తెలవారుకడ భవాని మంచన్నను వెదకికొని యతఁడు కానరామి పుత్రదుఃఖ మనుభవించెను. సూరన్న పుత్రోదయ మయినటులు సంతోషించెను.

కొల్లాయగుడ్డ కొకచివర ఒక మిఠాయిపొట్లము మఱొకచివర కజ్జపుపొట్లమును కట్టి దానిని బుజముపై వేసికొనఁగా ఒకటి యెదు

రొమ్మును మఱొకటివీఁపును జంగమురొమ్ము వీఁపుల లింగశంఖములవలె కొట్టుకొను చుండఁగా మంచన శైలారామము ప్రవేశించి బాలలోకమున కానందము కల్పించి ఆనంద పురుషుఁడై యుండెను.

కొన్నాళ్ళకు శ్యామావివాహము వచ్చినది. లగ్నము నిశ్చితమయినది. మంచన్న ఆ వార్తవిన్న తత్క్షణము శ్యామవద్దకు వెళ్లి 'శ్యామా! నన్ను పెండ్లాడుదు నని నీ నోటి మీఁదుగా నీవే యంటివికదా! ఇపుడు ఇంకొకనిని పెండ్లాడుదువా?' అని యనఁగా శ్యామ 'మంచనా! నీగోత్రము చెప్పు' మని అన్నది. మంచన 'కౌశికగోత్ర'మని యనఁగా శ్యామ 'మాగోత్రము చెప్పు'మనియన్నది. మంచన ఆలోచించుచు 'కౌశికగోత్రమే' అని 'శ్యామా! నీవు నాకుచెల్లెలివి' అని శ్యామనెత్తికొని 'అమలమ్మగారూ! అనంతుఁడుగారూ! మీరు నాకు తలిదండ్రులు; నన్ను నమస్కరింపనిండు' అని వారికి పాదాభివందనములు చేసి బాష్పప్లావిత నేత్రుఁడై కూర్చుండెను. అందఱకు కనుల వెంట ఆనందబాష్పము లుదయించెను. శ్యామ 'ఓయీ! నా కూఁతునిచ్చి నీకు వివాహము చేయుదును లెమ్ము' అనెను. 'మంచన, అంతవఱకే కాదు, ఆమెకు కూఁతురు పుట్టువఱకు పెండ్లికుమారుఁడయియే యుండు'నని మంచన్న అనెను.

కొలఁదినాళ్లలోనే శ్యామకు వివాహమయినది. ఆవివాహమయిన కొలఁదినాళ్లకే అనంతునకు జబ్బుచేసినది. భవానికి ప్రాణము మీఁదికి వచ్చెఁ గదనియు మంచన్నకు వార్త వచ్చినది. ఇంటివారందఱు వెంటనే వెళ్లుమని చెప్పినను 'అనంతుని యారోగ్యముచూచి మఱివెళ్లుదు'నని మంచన్న కదలలేదు. ఒకనాఁ డనంతుఁడే అతని బిలిచి 'మంచన్నా! వెంటనే నీవింటికి వెళ్లిరమ్ము' అని ఆదేశించెను. అనంతుఁడు చెప్పఁగనే మంచన బయలుదేరి రామాపురము వెళ్లెను.

మంచన్న యింట కాలిడకమున్నే సూరన్న లోనుండి యెదురుగావచ్చి 'దౌర్భాగ్యుఁడా! అమ్మచచ్చి ఆఱురోజులు కాఁగా ఇపుడేల వచ్చితివిరా అపాత్రుడా!' యని దవడలపై రెండు తాటించెను. మంచన్న దుఃఖమంచమున శయనించెను. అతని కారాత్రి అనంతునిపై దుస్స్వప్నములు వచ్చెను. అతఁడచటికి వెళ్లలేక యిచట నుండలేక ఆసులోకండెవలె అటుఇటు కొట్టుకొనెను.

మంచన రామాపురము విడిచి అనంతునియింట కాలువెట్టువఱకు వైద్యులీజబ్బిఁక నెమ్మదింపదని చెప్పుచుండిరి. మంచన యొక్క అపాంగప్రసారమే అతని దుఃఖమునకు ధర్మామెటరువలె నుండెను. అనంతుఁడిటు మోమటు వెట్టెను.

మంచనకు గుండెలలో రాయి పడ్డది. మంచనను చూచినపుడెల్ల అనంతునకు తీవ్రమగువేదన అతిశయించెడిది. వారు పరస్పరముచూచికొని కన్నీరుకార్చుచుండువారు. వారు దీర్ఘమగు చూపులతోడనే మాటలాడుకొనుచుండువారు. కొంతసేపటికి మంచన్న వెలుపటికి తొలఁగిపోవువాఁడు.

అనంతుఁ డీలోకులతో మాటలాడుట మాని దేవతలతో మాటలు సాగించినాఁడు. వారితో కొన్ని సైగలు చేయుట ప్రారంభించినాఁడు. పెద్దపెద్ద పేరులుకల దేవతలు వచ్చుచున్నారు కాఁబోలు! లేచికూర్చుండుచున్నాఁడు.

బందుగు లందఱు చుట్టు మూఁగినారు. భార్య ప్రక్కన నిలువఁబడి దుఃఖించుచున్నది. 'ఏమయిన చెప్పునో' యని అతులచంద్రుఁ డెదురుగా నిలువఁబడి తండ్రిముఖమును నిరీక్షించుచున్నాఁడు. ఒక్క మంచన్నయే పడునపుడు పట్టుకొనుచు, నోరు తెఱచినపుడు నీరుపోయుచు, తల్లికి పరిచర్య చేసినటులు చేయుచున్నాఁడు.

కొంతసేపటి కనంతుఁడు శాంతముగా పడుకొనెను. పిదప మిగుల శ్రమతో లేచి కను లింతంతలుచేసి బాష్పములు స్రవింపఁగా మంచన్నను కౌఁగలించుకొనెను. ఆ కౌఁగటిలోనే అనంతునిప్రేమ, ప్రాణములు రెండును పరసీమ మెట్టెను.

ఎవరియేడుపులలో వా రున్నారు. మఱి నాఁటిదాఁక మంచన్నమాట ఎవరికి తోఁపలేదు. వెదుక మనుష్యులఁ బంపిరిగాని అతని యునికి ఇంతవఱకు ఎవ్వరికి తెలియలేదు. అనంతునిచే జాగరిల్లిన జన్మాంతర సంబంధ మనంతునితో నంత మొందినదా?

సంపూర్ణము

ప్రణయగీతము

సుసర్ల రామమూర్తి గారు

విమల దరహాసచంద్రికా విలసనములఁ
బ్రేమరసపూరి తాపాంగ వీక్షణముల
లలిత సువ్యక్త మధురసల్లాపములను
మెఱపుచందాన క్షణములో వరలఁ జేసి
విదితముగ నాదునిర్మల హృదయమెల్లఁ
గలఁచిపోతివి వలపులు మొలకలెత్త
నాఁటిదినమున బృందావనంబునందుఁ
జెలువ మెసలారఁగా శిలాతలముఁ జేరి
యరుణసంకీర్ణ పాటలాధరముపైన
మురళి మోపెట్టి పంచమస్వరముతోడ
హాయిగా శ్రోత్రపర్వంబుఁ జేయునట్టి
దివ్యతరగాన మిపుడుఁ బ్రతిధ్వనించు
ఎచట డాగితో? వెదకితి—ఎఱుకపడవు!
కనులపండువుగాఁగ దర్శన మొసంగి
నిర్భరానందమును మది నెఱపుమయ్య!
వల్లవీలోల, నీలగోపాలబాల!